

మార్చి 21వ తేదీన 'ఆపరేషన్ గరుడ'లో భాగంగా చిత్తూరులోని ఓ మెడికల్ దుకాణంలో తనిఖీలు చేసిన అధికారులు

ఏ మందులైనా ఇచ్చేస్తాం..!



- కొన్నిరకాల మెడిసిన్‌కు వైద్యుల చీటీ తప్పనిసరి
- అయినా విక్రయించేస్తున్నారు
- జిల్లాలో మెడికల్ షాపుల తీరిది
- 'ఆపరేషన్ గరుడ'లోనూ వెల్లడి

● చిత్తూరుకు చెందిన ఓ వ్యక్తి తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ తిరుపతిలోని న్యూరాలజీ డాక్టరు వద్ద చికిత్స పొందుతున్నాడు. పది రోజులకు మాత్రలు రాసిచ్చారు. మాత్రలు అయిపోయాక మళ్లీ కావాలని సూచించాడు. పది రోజులు వాడాక నొప్పి తగ్గింది. మళ్లీ రెండ్రోజుల తర్వాత నొప్పి మొదలవడంతో స్థానిక మెడికల్ షాపుకెళ్లాడు. మాత్రల చీటీ చూపి.. మందులు కొని వాడాడు. డోస్ ఎక్కువ కావడంతో అతడిపై తీవ్ర దుష్ప్రభావం చూపింది. మళ్లీ వైద్యుడి వద్ద కెళ్లడంతో ఆయన మందలించాల్సి వచ్చింది.

● చిత్తూరులోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేసే వ్యక్తికి భార్య ఫోన్ చేసి.. తమ ఐదేళ్ల కుమారుడికి జ్వరం, జలుబు, దగ్గు వచ్చిందని మందులు తేవాలని కోరింది. ఆయన డ్యూటీ అయ్యాక ఇంటికెళ్లేటప్పుడు స్థానిక ఓ మెడికల్ షాపులో విషయం చెప్పి.. కొన్నిరకాల మందులు, సిరప్ తీసుకెళ్లాడు. వాటిని ఆ చిన్నారికి వాడారు. అవి సరైన మోతాదు కాకపోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న వైద్యుడు మందలించాడు. ఇలాంటివి జిల్లావ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయి.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి

జిల్లాలోని మందుల దుకాణాల్లో మత్తు కలిగించే మందులను సైతం యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. యాంటీ అలర్జీ, అధిక మోతాదు నొప్పి నివారణ మాత్రలు, దగ్గు సిరప్‌లను కచ్చితంగా డాక్టర్ల చీటీ ఉంటేనే విక్రయించాల్సి ఉండగా, దుకాణాల నిర్వాహకులు అవేమీ పట్టించుకోవడం లేదు. చాలా దుకాణాల్లో అర్హులైన ఫార్మసిస్టులే లేరని కొందరు వైదులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన 'ఆపరేషన్ గరుడ'లోనూ ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఆర్‌ఎంపీలతో కుమ్మక్కై కాలపరిమితి ముగిసిన మందులను గ్రామీణులకు అంటగట్టి వారి ప్రాణాలతో చెలగాలమాడుతున్నారన్న విమర్శలూ ఉన్నాయి.

హెచ్-1 రికార్డు తప్పనిసరి

హెచ్-1 రికార్డు అంటే విలువైన మందులు, మత్తు, నార్కోటిక్స్ యాంటీబయాటిక్స్ విక్రయించే సమయంలో దుకాణ యజమాని తప్పనిసరిగా తీసుకునే వ్యక్తి వివరాలు నమోదు చేయాలి. దీనిద్వారా మందులను సక్రమంగా వినియోగిస్తున్నారా..? లేదా..? అన్నది తెలుసుకోవచ్చు. ప్రతి మెడికల్ షాపుల్లోనూ ఈ రికార్డు తప్పనిసరిగా ఉండాలి.

పెరుగుతున్న కిడ్నీ బాధితులు

నొప్పి నివారణ మాత్రలు ఎక్కువగా వినియోగించడంతో కిడ్నీ బాధితులు పెరుగుతున్నారు. జిల్లాలో అధికారికంగా 756 మంది ఉండగా అనధికారికంగా మరో 500 మంది వరకు ఉంటారు.

ఎవరో వచ్చి తనిఖీ చేస్తేనే..

రెండు నెలల క్రితం ఉమ్మడి జిల్లాలో హోమియో మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. డూప్లికేట్ మందులు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో విజయవాడ నుంచి అధికారులు జిల్లాకు వచ్చి తనిఖీలు నిర్వహించాల్సి వచ్చింది. అలాగే గత మార్చి 21వ తేదీన చిత్తూరు నగరంలో నిషేధిత మందులు విక్రయిస్తున్నారని మెడికల్ షాపులపై 'ఆపరేషన్ గరుడ' పేరుతో రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. రెండు దుకాణాల్లో నిషేధిత, డాక్టర్ చీటీ లేకుండా మందులు విక్రయిస్తున్నారనే అభియోగంతో ఆయా దుకాణాల లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేశారు. ఇలా ఎవరో.. ఎక్కడి నుంచో వచ్చి దాడులు నిర్వహిస్తే తప్ప జిల్లాలోని డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేదు.

ఫార్మసిస్టు లేకుండానే..

జిల్లాలో 1,100 మెడికల్ షాపులు అధికారికంగా ఉంటే మరో 200లకు పైగా అనధికారికంగా ఉన్నాయి. అందులో ఆర్‌ఎంపీలు తదితరులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో సగానికంటే ఎక్కువగా దుకాణాల్లో ఫార్మసిస్టులు పనిచేయడం లేదు. ఒకరి పేరుతో ఫార్మసిస్టు సర్టిఫికెట్ పొంది మరొకరు దుకాణం నిర్వహిస్తున్నారు. యజమాని లేదంటే తక్కువ జీతానికి వచ్చే వ్యక్తిని దుకాణంలో నియమించుకుంటారు. అందువల్ల అనేకసార్లు ఒక ఔషధం బదులు మరొకటి రోగికి ఇచ్చిన సంఘటనలు ఉన్నాయి.

మామూళ్లు ఇవ్వకుంటేనే..!

మామూళ్లు ఇవ్వని మెడికల్ షాపులపైనే డ్రగ్స్ కంట్రోల్ అధికారులు కొరడా ఝుళిపిస్తారన్న ఆరోపణలున్నాయి. ఇకనైనా అన్ని షాపులను తనిఖీ చేయాలని జనం కోరుతున్నారు.

డాక్టర్లు సూచించిన మందులనే వాడండి



డాక్టర్లు సూచించిన మందులనే వాడండి. అలా కాకుండా డాక్టర్ చెప్పకుండా ఆయన ఇచ్చిన చీటీని చూపించి మళ్లీ మందులు కొని వాడొద్దు. దీంతోపాటు చాలా మంది జ్వరం, జలుబు, దగ్గు వస్తే మెడికల్ షాపులకు వెళ్లి నేరుగా మందులు కొని వాడుతుంటారు. ఇలా చేయడం ప్రమాదకరం.

- డాక్టర్ అరుణ్ కుమార్, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్



వెదురుకుప్పం మండలం ఎగువ కన్నికాపురం పాఠశాల వద్ద విరిగిపడ్డ చెట్టు కొమ్మ



ఎగువ కన్నికాపురం దేవాలయంపై కూలిన విద్యుత్‌స్తంభం, గుమికూడిన జనం

గాలివాన బీభత్సం

వెదురుకుప్పం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. గంటావారిపల్లె గ్రామ పంచాయతీ ఎగువ కన్నికాపురంలో కొన్నిచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మామిడి చెట్ల నుంచి పిందెలు కూడా నేలరాలాయి. కార్వేటినగరం మండలంలోనూ గాలివానతో మామిడి కాయలు నేలరాలాయని రైతులు తెలిపారు.

పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి



ఆవుల కళేబరాలు

గంగవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందాయి.గంగవరం జేఆర్ కొత్తపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం, ఆయన కుమారుడు ఓబులప్ప వ్యవసాయంతోపాటు ఆవులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగానే సోమవారం సాయంత్రం ఇంటిముందు కానుగ చెట్టు కింద రెండు ఆవును కట్టి ఉంచారు. ఇంతలో భారీ ఈదురుగాలులతోపాటు వర్షం కురుస్తుండగా కానుగ చెట్టు వద్ద పిడుగుపడి భారీ శబ్దం వచ్చింది. కొంతసేపటికి గ్రామస్తులు చెట్టు వద్దకు వచ్చి చూసేసరికి రెండు ఆవులూ మృతి చెందాయి. ప్రభుత్వం పరిహారం ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

11 మండలాల్లో వాన

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో ఉపరితల ఆవర్తనం కారణంగా 11 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. మండలాల వారీగా.. పూతలపట్టులో 24, యాదమరిలో 22, పెద్దపంజాణిలో 14.6, చిత్తూరులో 7.4, తవణంపల్లెలో 4.8, సోమలలో 4.2, చౌడేపల్లెలో 4.2, పులిచెర్లలో 4, గుడిపాలలో 2.6, బంగారుపాళ్యంలో 2.2, ఐరాలలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఏప్రిల్ నెల సాధారణ వర్షపాతం 7 మి.మీ నమోదు కావాల్సి ఉండగా, సోమవారం నాటికి 19.9 మి.మీ వర్షం కురిసింది. 16 మండలాల్లో 20శాతానికి మించి, మిగిలిన 15 మండలాల్లో సాధారణానికి మించి 20 శాతంలోపు వర్షపాతం నమోదయ్యింది.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించిన జేసీ విద్యాధరి, మేయర్ అముద, ఎమ్మెల్యే జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, దళిత సంఘాల నేతలు

చదువుకుంటేనే సమాజంలో గౌరవం

- జేసీ విద్యాధరి
- ఘనంగా అంబేడ్కర్ జయంతి

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలు చదువుకుని ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందని జేసీ విద్యాధరి అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో ఆడపిల్లలు చదువుకోవడానికి ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏ రంగంలో రాణించాలన్నా విద్య చాలా అవసరమన్నారు. చదువుకున్న యువతకు వృత్తినైపుణ్యంపై శిక్షణ ఇవ్వడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొస్తున్నాయని, దీన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలన్నదే ప్రభుత్వ ఆలోచనగా ఉందన్నారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్లు, డీవీఎంసీ సభ్యులు అంబేడ్కర్ జీవితఘట్టాలు, బడుగు బలహీన వర్గాలకు, దేశానికి చేసిన సేవలను వివరించారు. అంతకుముందు దర్గా సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ, అధికారులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. అక్కడినుంచి ర్యాలీగా ఎంఎస్ఆర్ కూడలి, గాంధీ విగ్రహం కూడలి, ఓవర్‌బ్రిడ్జి మీదుగా అంబేడ్కర్ భవన్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమాల్లో సాంఘిక సంక్షేమం, సాధికారిత అధికారి చెన్నయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, మాల కార్పొరేషన్ డైరెక్టర్లు యుగంధర్, బాబు, డీవీఎంసీ సభ్యులు రాజ్‌కుమార్, శంకర్, రవి, దేవరాజులు, మునస్వామి, డేవిడ్, సప్తగిరి ప్రసాద్, గోవిందన్, తదితరులు పాల్గొన్నారు.

సెలవులో డీఎఫ్‌వో భరణి

- ఇన్‌చార్జిగా తిరుపతి డీఎఫ్‌వో

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డీఎఫ్‌వో భరణి వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లారు. మంగళవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు ఆమె సెలవు పెట్టారు. అప్పటివరకు ఇన్‌చార్జిగా తిరుపతి డీఎఫ్‌వో వివేక్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ సీసీఎఫ్ యశోదబాయి ఆదేశాలు జారీ చేశారు.

77మంది కార్యదర్శులకు పంచాయతీల కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ఐదో గ్రేడ్ పంచాయతీ కార్యదర్శుల్లో 77 మందికి గ్రేడ్-4 ఉద్యోగ ఉన్నతులకు ఇటీవల కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్ రావులు కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగ ఉన్నతులు పొందిన వీరికి పంచాయతీల కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా, గ్రేడ్-6 నుంచి గ్రేడ్-5కు 63 మంది ఉద్యోగ ఉన్నతులపై ఇటీవల కౌన్సెలింగ్ జరిగింది. వీరికి కూడా ఈ వారంలోగా పంచాయతీల కేటాయింపులు జరుగుతాయని ఆ శాఖ అధికారి తెలిపారు.



తొక్కేసిన వరిపంట

పంటలపై ఆగని గజదాడులు

కల్లూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో ఒంటరి ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. వారం రోజులుగా పంటలను ధ్వంసం చేశాక అడవిలోకి వెళ్లిపోతున్న ఒంటరి ఏనుగు ముందుగా తూర్పు విభాగం అటవీప్రాంతం నుంచి ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో బయల్దేరింది. దేవళంపేట పంచాయతీలోకి అడుగుపెట్టిన ఒంటరి ఏనుగును అటవీశాఖ అధికారులు టపాకాయలు కాలుస్తూ వెంబడించారు. పాళెం పంచాయతీ గుండా కల్లూరు పంచాయతీ కట్టకింద ఇండ్లు వద్దకు చేరుకున్న ఒంటరి ఏనుగు రైతు మధుబాబుకు చెందిన అరటిచెట్లను ధ్వంసం చేసింది. తర్వాత ఇందిరానగర్ వద్ద ఉన్న హైవే రోడ్డును దాటి, పాతపేట పంచాయతీ మీదుగా సదుం మండలం గంటావారిపల్లె సమీపంలోని అడవిలోకి వెళ్లిపోయింది. ఈ సమయంలోనే పాకాల మండలంలోని పదిపుట్లబైలు, ఈ-పాలగుట్టపల్లె పంచాయతీ మీదుగా రాయవారిపల్లె పంచాయతీలోకి మరో ఒంటరి ఏనుగు చేరుకుంది. అక్కడినుంచి కమ్మపల్లె పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లెలోని రైతు మోహన్‌రెడ్డి, మనోజ్‌రెడ్డికి చెందిన వరి పంటను ధ్వంసం చేసి.. సమీపంలోని మామిడి చెట్లను విరిచేసింది. వ్యవసాయ డ్రిప్ పైపులను ధ్వంసం చేసింది. బండమీద కుప్పలు వేసిన వరిగడ్డిని చిల్లాడింది. మామిడి చెట్లను విరుచుకుంటూ తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చాకలికోన, బోడబండ వద్దకు చేరుకుంది. సోమవారం ఉదయం అటవీశాఖ అధికారులు ధ్వంసమైన పంటలను పరిశీలించారు. చాకలికోన వద్ద ఒక ఒంటరి ఏనుగు, సదుం మండలం గంటావారిపల్లె మరో ఒంటరి ఏనుగు తిష్ఠ వేసినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి తెలిపారు.



ధ్వంసమైన డ్రిప్ పరికరాలు

- సోమవారానికి పూర్తయ్యింది 21.41 శాతమే
- సచివాలయ సిబ్బందిపై అధికారుల అసహనం

పీజీఆర్ఎస్ అర్జీలపై ఫీడ్ బ్యాక్ ఇలాగేనా?

సంక్షిప్తంగా..	
మొత్తం అర్జీలు	: 44078
ఫీడ్‌బ్యాక్ పూర్తయినవి	: 9436
మిగిలినవి	: 34642

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చిన 44,078 అర్జీలను పరిష్కరించి, ఆడిట్ చేశారు. వీటిపై చేపట్టిన ఫీడ్‌బ్యాక్ (అభిప్రాయ) సేకరణ నత్తనడకన సాగుతోంది. సోమవారం నాటికి 21.41 శాతం మాత్రమే పూర్తవడంతో సచివాలయ సిబ్బందిపై అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించిన తీరుపై అర్జీదారుల అభిప్రాయాలను గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని గతనెల పదో తేదీన ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం అర్జీదారుల వివరాలను కార్యదర్శుల లాగిన్లకు పంపించారు. అయితే చాలామంది సచివాలయ కార్యదర్శులు తమ లాగిన్లను కూడా చూడని పరిస్థితి నెలకొంది. చూసినవారూ సమాచారం సేకరణలో వెనుకంజలో ఉన్నారు.

తొమ్మిది అంశాలపై.. : అర్జీదారుల నుంచి సచివాలయ కార్యదర్శులు తొమ్మిది అంశాలపై అభిప్రాయాన్ని సేకరించాలి. సంబంధిత అధికారులు అర్జీదారుడితో సౌమ్యంగా మాట్లాడారా? లేదా? అభిప్రాయాన్ని ఓర్పు, సహనంతో విన్నారా లేదా వంటివి ప్రధానమైనవి. చివరగా అధికారులకు ఎంత రేటింగ్ (ఒకటి నుంచి ఐదు వరకు) ఇవ్వవచ్చో అర్జీదారులే తెలియజేసేలా పొందుపరిచారు. ఈ సమాచారాన్ని యాప్‌లో కార్యదర్శులు నమోదు చేయాలి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్థన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిథ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.



గుండుతో స్వామిని దర్శించుకుని



ధ్వజస్తంభానికి మొక్కి



అఖిలాండం వద్ద టెంకాయకొట్టి



హారతిచ్చి





అన్నదానానికి బిడ్డపేర విరాళమిచ్చి, భక్తులకు వడ్డించి

బిడ్డ కోసం..

ఆమె ఈ నేలమీద పుట్టలేదు. ఆమె హిందువు కాదు. ఆమె ఆచార వ్యవహారాలు భిన్నమైనవి. అయినా హిందూ విశ్వాసాలకు కట్టుబడ్డారు. పూజాపునస్కారాలు చేసి, మన ఆచారాలు పాటించారు. బిడ్డ కోసం ఒక తల్లి పడ్డ తపన ఇది. పవన్‌కల్యాణ్ సహచరి అన్నా లెజినోవా రెండు రోజులుగా తిరుమలలో వ్యవహరించిన తీరు అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తమ కుమారుడు మార్క్ శంకర్ గాయపడడంతో తల్లడిల్లిన ఆ తల్లి.. స్వల్పగాయాలతో క్షేమంగా బిడ్డ బయటపడడంతో తేలికపడి, తిరుమల కొండకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రష్యాలో పుట్టి పెరిగిన అన్నా లెజినోవా క్రిస్టియన్ అయినప్పటికీ శ్రీవేంకటేశ్వరుడిమీద సంపూర్ణ విశ్వాసం ప్రకటిస్తూ సంతకం చేశారు. హిందూ ఆచారాలకు అనుగుణంగా గుండు చేసుకుని, స్వామిని దర్శించుకున్నారు.



తనూ అందరితో కలిసి భోంచేసి..

అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఏం చేయాలంటే..!

● అగ్నిమాపక వారోత్సవాల్లో అవగాహనా కార్యక్రమాలు



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదం సంభవిస్తే.. ఏం చేయాలి? ఎలా బయటపడాలి? అనే విషయాలపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో వివిధ అంశాలపై ప్రాక్టికల్‌గా డ్రిల్ చేసి వివరించనున్నారు. ఎండాకాలం ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే విలువైన ఆస్తులు కాలి బూడిదయ్యే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏటా నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలపై జాగ్రత్తలు సూచించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక దళ సిబ్బందికి నివాళులర్పించారు. 15న ప్రధాన కూడళ్లలో ప్రదర్శన, 16న అపార్ట్‌మెంట్లు, నివాస ప్రాంతాల్లో, 17న పాఠశాలలు, కళాశాలల వద్ద, 18, 19, 20 తేదీల్లో పరిశ్రమలు, పెట్రోలు బంకులు, వర్తక, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు, ఫంక్షన్ హాళ్ల వద్ద అవగాహన కల్పిస్తారు.

ఇంగ్లాండ్ సిరీస్ ఛాలెంజింగ్

● టీం ఇండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్



తిరుమల, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): ఇంగ్లాండ్ సిరీస్ ఛాలెంజింగ్‌గా ఉండబోతుందని టీం ఇండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్ అన్నారు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌లన్నీ ఎప్పుడూ సవాలుగానే ఉంటాయన్నారు. తిరుమల శ్రీవారిని ఆయన సోమవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. టీ20 వరల్డ్ కప్ గెలిచాక శ్రీవారిని దర్శించుకున్న తాను ఇండియా ఛాంపియన్ ట్రోఫీ కూడా గెలవాలని మొక్కుకున్నట్టు తెలిపారు. ప్రస్తుత యువ క్రికెటర్లు ఐపీఎల్‌లో తీవ్ర ఒత్తిడిలో బాగా ఆడుతున్నారన్నారు. ఇండియన్ టీంకు వారు వచ్చినప్పుడు కలిసొస్తుందని అభిప్రాయపడ్డారు.

అమెరికాలో వెంకటగిరి యువకుడి మృతి

వెంకటగిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కిన్నంబేటి వరప్రసాద్(బాబ్జీ) కుమారుడు విశ్వతేజ(34) అమెరికాలో మృతి చెందినట్లు సమాచారం. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న విశ్వతేజ అక్కడి అమ్మాయినే వివాహం చేసుకున్నాడు. అతడి మృతికి గల కారణాలు తెలియరాలేదు.

తిరుపతి డీఎస్పీగా భక్తవత్సలం బాధ్యతల స్వీకరణ

● శాంతి భద్రతలు, నేరాలు నియంత్రణకు పెద్దపీట




తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర డీఎస్పీగా భక్తవత్సలం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సత్యవేడు, వెులకలచెరువు స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం జరిగిన డీఎస్పీల బదిలీల్లో తిరుపతి డీఎస్పీగా భక్తవత్సలంను ప్రభుత్వం నియమించింది. దీంతో ఈయన తిరుపతి డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాద పూర్వకంగా ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతిలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, నేరాల నియంత్రణకు అన్ని సర్కిళ్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో సమన్వయం చేసుకుని పనిచేస్తామని చెప్పారు. విధులు పట్ల నిర్లక్ష్య భావాన్ని సహించేది లేదన్నారు.

మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులు

● మాజీ ఎమ్మెల్యే అనుచరుడి బరితెగింపు

తిరుచానూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఓ ఉద్యోగినిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన సోమవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా... తిరుపతి మాజీ ఎమ్మెల్యే సిఫారసుతో వెంకటరమణ అనే వ్యక్తి గతంలో ఒప్పంద కార్మికుడిగా శిల్పారామంలో అటెండర్‌గా చేరాడు. శిల్పారామానికి చెందిన రాష్ట్ర స్థాయి అధికారితో పాటు నామినేటెడ్ పదవిలో ఉన్న ఓ నాయకుడి కుటుంబంతో ఇతడికి పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో వెంకటరమణ పెత్తనం చెలాయిస్తున్నాడు. పదిరోజుల క్రితం ఇతడు ఓ ఉద్యోగిని వేధించాడు. ఆమె ఎదురుతిరగడంతో సస్పెండ్ చేయిస్తా... తానేది అనుకుంటే అది జరుగుతుందని బెదిరించాడు. చివరకు బాధితురాలు తోటి ఉద్యోగుల వద్ద వాపోయింది. దీంతో వారంతా ఏకమై సోమవారం సంస్థ ఏవో సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏవోను వివరణ కోరగా బాధితురాలి ఫిర్యాదును ఉన్నతాధికారులకు పంపుతున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్న ఓ ఉన్నతాధికారి బెదిరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోయినట్లు తెలిసింది.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు, వరుస సెలవులు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సుమారు 29వేలమంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 586, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,554మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,648మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,087మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,561, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 551మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 281మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 100మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 30,353 అమ్ముడైనట్లు అధికారులు చెప్పారు.

ఎండ... వాన



ఉదయం ఎండ తీవ్రతకు బోసిపోయిన చిత్తూరులోని కలెక్టర్ బంగ్లా పరిసరాలు - సాయంత్రం ఎమ్మెస్సార్ జంక్షన్ వద్ద కురుస్తున్న చిరుజల్లులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎండలు అట్టుడికిపోతున్నాయి. చిత్తూరులో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతకు జనం ఇబ్బంది పడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. ఎస్ఆర్‌పురం మండలంలో 38.6 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. మండలాల వారీగా.. పులిచెర్ల, వెదురుకుప్పంలో 38.4, తవణంపల్లెలో 37.4, చిత్తూరు, గుడిపాల, సోమలలో 37.1, గుడుపల్లె, కుప్పం, శాంతిపురంలో 36.6, బంగారుపాళ్యంలో 36.5, చౌడేపల్లె, గంగాధరనెల్లూరులో 36.4, ఐరాల, కార్వేటినగరం, నగరి, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, విజయపురంలో 36.3, గంగవరం, పెద్దపంజాణిలో 36.2, యాదమరిలో 36, సదుంలో 35.4, రొంపిచెర్లలో 35.3, వి.కోటలో 35.1, బైరెడ్డిపల్లెలో 34.5, పలమనేరు, రామకుప్పంలో 34, పుంగనూరులో 33.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సోమల: మండలంలోనూ ఉదయం ఎండలు మండిపోయినా.. సాయంత్రం నాలుగు గంటలకు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు, కూలీలు ఊరట చెందారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి

జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి తెలిపారు. సోమవారం నుంచి ఈనెల 20వ తేదీవరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గుడిపాల మండలం పశుమంద గ్రామంలోని బెంగళూరుకు చెందిన మోంటెకర్లో లిమిటెడ్ - చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే ఫేస్- 3 కంపెనీలో అగ్ని ప్రమాదాల నివారణపై కార్మికులకు అవగాహన కల్పించి, మాక్ డ్రిల్ నిర్వహించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. 15న ప్రధాన కూడళ్లలో ప్రదర్శన, 16న అపార్ట్‌మెంట్లు, నివాస ప్రాంతాల్లో, 17న పాఠశాలలు, కళాశాలల వద్ద, 18న పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గోడౌన్ల వద్ద, 19న ఆస్పత్రుల వద్ద, 20వ తేదీన వర్క్ షాప్ నిర్వహిస్తామని వివరించారు. ఏడీఎఫ్‌వో కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



యాస్మిన్ (ఫైల్ ఫొటో)

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నగరంలోని న్యూ బాలాజీ కాలనీకి చెందిన ఆర్ఎంపీ షౌకత్ అలీ, ముంతాజ్ దంపతులకు ముగ్గురు అమ్మాయిలు. మూడో కుమార్తె యాస్మిన్ ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. ఈ క్రమంలో యాస్మిన్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి తొమ్మిదో తేదీన వివాహం చేయడానికి ముహూర్తం పెట్టుకున్నారు. పెళ్లికి మూడ్రోజుల ముందు తనతోపాటు చదువుకున్న పూతలపట్టు మండలం పోటుకనుమకు చెందిన సాయితేజను ఆమె ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ వివాహం ఇష్టంలేని తల్లిదండ్రులు పోటుకనుమకు వెళ్లి తమతో ఇంటికి వచ్చేయాలని యాస్మిన్‌ను కోరారు. అప్పట్లో ఆమె రాలేదు. ఆదివారం చిత్తూరులోని తల్లిదండ్రుల ఇంటికి రాగా పెళ్లిపై యాస్మిన్‌ను మందలించారు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ కమ్మీకి చున్నీతో ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే భర్త సాయితేజ మాత్రం తన భార్యను అత్తమామలే చంపేశారని ఆరోపించాడు. యాస్మిన్ తల్లి ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సోమవారం సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

వరసిద్ధుడి సేవలో విజయేంద్ర ప్రసాద్



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ రచయిత, రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్ సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తిరుపతిలో 22 మందికి టీడీఆర్ బాండ్ల పంపిణీ



లబ్ధిదారులకు టీడీఆర్ బాండ్లు అందజేస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారిలో 22 మందికి సోమవారం బాండ్లు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న టీడీఆర్ మేళాలో అర్హత పొందిన వీరికి కమిషనర్ మౌర్య బాండ్లు అందించారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారికి సంబంధించి 95 శాతం ఆన్‌లైన్ చేశామని ఆమె తెలిపారు. కోర్టు కేసులు, ప్రభుత్వ, టీటీడీ భూములు, 22ఏ కింద ఉన్నవి మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఐదు బాండ్లు ఇచ్చామని, సోమవారం 22 బాండ్లు ఇచ్చామన్నారు. ఖాళీ జాగాలకు స్థానిక విలువ ప్రకారం గుర్తించామన్నారు. టీడీఆర్ బాండ్ల కమిటీ సమావేశమై 96 మందికి ప్రీ అప్రూవల్ తీసుకుని అర్హత ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరూ గిఫ్ట్ డీడ్ ఇస్తే తరువాత బాండ్లు అందజేస్తామని అన్నారు. వీరు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆర్డీ విజయభాస్కర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీసీపీ మహా పాత్ర, ఏసీపీ లు బాలాజీ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దారుణంగా పడిపోయిన కూరగాయల ధరలు

లబోదిబోమంటున్న రైతులు

పలమనేరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్‌లో కూరగాయల ధరలు దారుణంగా పడిపోయాయి. మూడు నెలలుగా టమోటా 15 కిలోల బాక్సు ధర రూ.150కి మించలేదు.క్యాబేజి, క్యాలీఫ్లవర్, కాకర, చిక్కుడు, మిరప, ఇలా అన్నిరకాల కూరగాయల ధరలూ గణనీయంగా తగ్గిపోయాయి. సోమవారం కూడా రైతులకు గిట్టుబాటు ధర లభించలేదు. అప్పులు చేసి సాగు చేసిన రైతులకు కూలీ ఖర్చులు కూడా అందక లబోదిబోమంటున్నారు.

రైతుకయ్యే ఖర్చులిలా..

ఏ రకం కూరగాయ సాగు చేయాలన్నా రైతులకు ఎకరానికి కనీసం రూ.లక్షనుంచి లక్షన్నర వ్యయం చేయాల్సి వస్తోంది. పంట చేతికొచ్చాక మార్కెట్‌కు తీసుకురావడానికి బస్తాకు ఆటోకు రూ.30 చెల్లించాలి. సంచి ధర రూ.6. మండీ వ్యాపారికి కమీషన్ రూ.100కు రూ.10 చెల్లించాలి.



పలమనేరు మార్కెట్‌కు సోమవారం రైతులు తీసుకొచ్చిన కూరగాయలు

పలమనేరు మార్కెట్‌లో కూరగాయల ధరలిలా..

టమోటా 15 కిలోల బాక్సు	రూ.150-170
క్యాబేజి 46నుంచి 50 కిలోలు	రూ.100
కాకర 40 కిలోల బాక్సు	రూ.800
క్యారెట్ 20 కిలోల సంచి	రూ.350
క్యాప్సికమ్ 10 కిలోల బ్యాగ్	రూ.100
మిరపకాయలు కిలో	రూ.30
బజ్జి మిరపకాయలు కిలో	రూ.10
బెండ 20 కిలోల బాక్సు	రూ.200
చిక్కుడు 20 కిలోల సంచి	రూ.500-600
దోస(కీరకాయ) 50 కిలోల సంచి	రూ.100
బంగాళాదుంప 40 కిలోల సంచి	రూ. 500

ఈ ధరలను ఊహించలేదు



మూడెకరాల్లో టమోట, ఎకరాలో కాకర సాగు చేశా. ధరలు ఈ స్థాయిలో పడిపోతాయని ఊహించలేదు. సాగుకు చేసిన అప్పులెలా తీర్చాలో తెలియడం లేదు.

- రవీంద్రరెడ్డి, కూర్మాయి గ్రామం, పలమనేరు మండలం

నిండా మునిగిపోయా



క్యాలీఫ్లవర్ సాగుచేసి నిండా మునిగిపోయా. కూలీల ఖర్చులు కూడా చేతికి అందలేదు. మార్కెట్‌కు పంటను తీసుకొచ్చాక ధరలు చూస్తే కడుపుమండిపోతోంది.

- మోహన్, బొమ్మిదొడ్డి, పలమనేరు మున్సిపాలిటీ

ప్రభుత్వం ఆదుకోవాలి



బీరకాయల సాగుచేశా. కూలీల ఖర్చులు కూడా రావడం లేదు. దీనికి ప్రభుత్వమే పరిష్కారం చూపి రైతులను ఆదుకోవాలి.

- శరత్, చింతలగుంట, బైరెడ్డిపల్లె మండలం

ఆత్మహత్యలే శరణ్యం



బీరకాయల సాగు చేశా. ప్రస్తుతం పలుకు తున్న ధరలే మరి కొంత కాలం కొనసాగితే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం. లాభాలు అటుంచిదే చివరకు అప్పులే మిగులుతున్నాయి.

- మునివెంకటరెడ్డి, పెద్దఉప్పరపల్లె, సోమల మండలం



చిత్తూరు రైల్వేస్టేషన్‌లో విజయ చిహ్నాన్ని చూపుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు - ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు

అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ ప్రధాన అజెండా

సీఎం చంద్రబాబు కృషితోనే తిరుపతి - కాట్పాడి రైల్వే డబుల్ లైన్ ● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ/చిత్తూరు రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమమే టీడీపీ ప్రధాన అజెండా అని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కృషితోనే తిరుపతి - కాట్పాడి డబుల్ లైన్‌ను కేంద్రం మంజూరు చేసిందన్నారు. 104 కి.మీల తిరుపతి - కాట్పాడి వయా చిత్తూరు రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుకు కేంద్రం రూ.1332 కోట్లు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుతో చిత్తూరు జిల్లా విద్యా, వ్యాపార, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయని హర్షం వ్యక్తం చేశారు. రైల్వే డబుల్‌లైన్ నిర్మించే మార్గంలో హైవే అండర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా ఉంటుందని వివరించారు. చిత్తూరు జిల్లాలో మ్యాంగో బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన, వైద్య పరికరాల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం - అభివృద్ధి రైలు పట్టాల్లాగా సమానంగా జరుగుతున్నాయని ఎంపీ వివరించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. తిరుపతి - కాట్పాడి రైల్వే డబుల్ లైన్ తీసుకొచ్చిన ఎంపీకి అభినందనలు తెలిపారు. రైల్వే డబుల్ లైన్ ఏర్పాటైతే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు చిత్తూరులో ఆగనున్నాయని హర్షం వ్యక్తం చేశారు. పర్యాటకుల రాకపోకలతో జిల్లా కేంద్రమైన చిత్తూరు అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ.. రైల్వేలైన్ మంజూరులో కీలక పాత్ర పోషించిన ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఒక ప్రాంతం అభివృద్ధికి రవాణా వ్యవస్థ ఎంతో కీలకమని, అటువంటి రైల్వేలైన్ సాధించిన ఎంపీకి ప్రజలంతా రుణపడి ఉంటారని అన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. రైల్వే డబుల్ లైన్ అభివృద్ధి పనుల్లో భాగంగా మెసానికల్ మైదానం సమీపంలో రైల్వే బ్రిడ్జి మంజూరైందని, దీంతో ఈ మార్గంలో ప్రయాణించే నగరవాసులు చిరకాలంగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించిందని చెప్పారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు రావాల్సిన మరిన్ని పనులను ఎంపీ త్వరలో సాధిస్తారనే నమ్మకం ఉందన్నారు. అనంతరం ఎంపీని ఎమ్మెల్యేలు సన్మానించారు. ఆ తర్వాత ఎంపీ, ఎమ్మెల్యేలు చిత్తూరు రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. రైల్వే అధికారులతో రైల్వే డబుల్ లైన్ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ కింద చిత్తూరు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులు ఫిబ్రవరిలోపు పూర్తి కావాల్సి ఉండగా ఇంకా 50 శాతం కూడా పూర్తికాకపోవడంతో కాంట్రాక్టరుపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.

దేవుడా నాకెందుకీ శిక్ష?

గుడికెళ్లాలని తెచ్చిన మాలలు భర్త మృతదేహానికి వేయాల్సి వచ్చిందంటూ భార్య రోదన



గోపాల్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): 'దేవుడా నాకెందుకీ శిక్ష విధించావు. గుడికెళ్లాలని తీసుకొచ్చిన పూలమాలలను నా భర్త మృతదేహానికి వేయాల్సి వచ్చిందే' అంటూ భార్య విలపించడం అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. గంగాధరనెల్లూరు మండలం తిరువీధికుప్పం పంచాయతీ జూపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గోపాల్‌రెడ్డి స్వగ్రామంలో ఉంటున్నారు. భార్య మీనా, పిల్లలు హరిరెడ్డి, పూజితరెడ్డి, నందినిరెడ్డిలు బెంగళూరులో ఉంటూ అప్పుడప్పుడు జూపల్లెకు వచ్చి వెళుతున్నారు. ఈ క్రమంలో జూపల్లెకు 15కిలోమీటర్ల దూరంలో ఉన్న తమిళనాడు వళ్లిమలై గుడిలో సుబ్రహ్మణ్యస్వామికి సోమవారం పూజలు చేయాలని గోపాల్‌రెడ్డి దంపతులు అనుకున్నారు. ఇందులో భాగంగా గుడిలో పూజలకు అవసరమైన నాలుగు పూలమాలలు తీసుకుని ఆదివారం రాత్రి మీనా బెంగళూరు నుంచి బయల్దేరారు. అర్ధరాత్రి దాటాక గోపాల్‌రెడ్డికి గుండెనొప్పిగా ఉందని బామ్మర్దికి చెప్పాడు. ఆయనొచ్చి గోపాల్‌రెడ్డిని కారులో ఎక్కించుకుని ఆస్పత్రికి బయల్దేరగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మరోవైపు బెంగళూరు నుంచి తెల్లవారు జామున 3.30గంటల ప్రాంతంలో జూపల్లెకు వచ్చిన మీనాకు విషయం తెలియడంతో ఆమె రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే థామస్ సోదరుడు నీది, టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, వైసీపీ, బీజేపీ నేతలు గోపాల్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్, అధికారులు - ఎక్స్‌కవేటర్‌తో రాతికూసాల తొలగింపు

ఆక్రమణలోని రైతుల భూములకు మోక్షం

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు విన్నవించడంతో పరిష్కారమైన సమస్య - సంతోషం వ్యక్తం చేసిన బాధితులు

గంగాధరనెల్లూరు,ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతుల భూములను ఓ గుడి నిర్వాహకులు ఆక్రమించేశారు. దీనిపై బాధిత రైతులు అప్పటినుంచి పోరాడుతూనే ఉన్నారు. తాజాగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో విన్నవించడంతో సోమవారం సమస్య పరిష్కారమైంది. గంగాధరనెల్లూరు మండలం అగరమంగళం గ్రామానికి సమీపంలో చెరువు కింద కొన్నేళ్ల కిందట బెంగళూరుకు చెందిన దీపక్ కుమార్ తాళ్ల అనే అతను అంకాల పరమేశ్వరి గుడి నిర్మించారు. ఈ గుడిని విస్తరించే భాగంగా నిర్వాహకులు సమీపంలోని రైతుల భూములను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే భూమి విక్రయించడానికి రేట్ల విషయంలో తేడా వచ్చి పెండింగ్ పడింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈసారి గుడి నిర్వాహకులు ఆ పార్టీ నేతలను అడ్డుపెట్టుకుని శంకర బోయుడుకు చెందిన భూమి 79 సెంట్లు, ఆనందబాబుకు చెందిన భూమి 18 సెంట్లు, చిట్టెమ్మకు చెందిన భూమి 84 సెంట్లు, బీష్మయ్యకు చెందిన ఎకరా, పార్వతికి చెందిన భూమి 66 సెంట్లను ఆక్రమించేశారు. చుట్టూ ఫెన్సింగ్ కూడా వేసేశారు. అప్పటినుంచి బాధితులు తమ భూములు ఇప్పించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బాధితులు నెల కిందట పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు సమస్యను తెలియజేశారు. జిల్లా అధికారుల సూచనలతో ఆర్డీవోతోపాటు మండల రెవెన్యూ అధికారులు గుడివద్ద 20 రోజుల క్రితం రైతుల సమక్షంలో మీటింగ్ పెట్టారు. వారం రోజుల్లోగా రైతులతో సెటిల్‌మెంట్ చేసుకోవాలని లేదంటే భూములను తిరిగిచ్చేయాలని గుడి నిర్వాహకులను ఆదేశించారు. అయితే వారు సెటిల్‌మెంట్ చేసుకోక పోవడంతో సోమవారం జిల్లా సర్వేశాఖ అధికారి మహబూబ్, తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ తులసీరామ్, ఆర్ఐ ఏకాంబరం, వీఆర్వోలు, సచివాలయం సర్వేయర్లతోపాటు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ ఎక్స్‌కవేటర్‌తో ఫెన్సింగ్‌ను తొలగించారు. భూములకు హద్దులను చూపించి, రాళ్లను నాటారు. తర్వాత ఆ భూములను రైతులకు అప్పగించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.



ఆలయ ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ - సుందరంగా అలంకరించిన సుపథ మండపం

కాణిపాకంలో తమిళ నూతన సంవత్సర వేడుకలు

● మూల విరాట్‌కు చందనాలంకారం



వరసిద్ధుడి గ్రామోత్సవంలో ఉభయదారులు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో తమిళ నూతన సంవత్సర వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన దివంగత రాజమాణిక్యం, ఆయన కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు. వరసిద్ధుడి ఆలయంలో మామిడి తోరణాలు, వివిధ రకాల పుష్పాలతో అణివేటి, సుపథ మండపాలను అలంకరించారు. ఉదయం స్వామి వారికి ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం చేశాక మూలవిరాట్‌ను శుద్ధమైన చందనంతో అలంకరించారు. తమిళ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్వామివారికి నిర్వహించే అభిషేకంతోపాటు నిత్య కైంకర్యాలను రద్దు చేశారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, బాలాజీనాయుడు, ఉభయదారులు పాల్గొన్నారు.

పీహెచ్ఎంఈయూ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసమూర్తి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (పీహెచ్ఎంఈయూ) కడప జోన్ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యూనియన్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి కడపలో యూనియన్ కడప జోన్ సర్వసభ్య సమావేశంలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

పంటలపై దుప్పుల దాడులు

సోమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో విస్తారంగా సాగులో ఉన్న టమోటా, దోస తోటలకు దుప్పుల బెడద తీవ్రంగా ఉంది. ఆదివారం రాత్రి సోమల, కరకమంద, వల్లిగట్లలో పలువురి రైతుల టమోటా తోటల్లోకి చేరుకుని పంటలను ధ్వంసం చేశాయని బాధిత రైతులు వాపోయారు. సమీప అటవీ ప్రాంతంలో వేసవితో నీటి జాడలేక పొలాల వైపు దుప్పులు వస్తున్నాయి. శనివారం రాత్రి తమ్మినాయనపల్లె, కురవపల్లె వద్ద టమోటా పొలాల్లోకి దుప్పులు వచ్చి ధ్వంసం చేశాయి. తోటల్లో దుప్పులు తొక్కివేయడంతో ఊతంగా నాటిన కర్రలు ధ్వంసమయ్యాయి. దుప్పులతోపాటు అడవి పందులు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. నడింపల్లె, నెల్లిమంద, మేటిమంద తదితర ప్రాంతాల్లో దుప్పుల బెడద అధికంగా ఉంది. అటవీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే సోమల-చిన్న సోమల మార్గంలో నెమళ్ల బెడద తీవ్రంగా ఉంది.

'అగ్ని' అమరులకు జోహార్లు



నివాళులర్పిస్తున్న అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రవీణ్ కుమార్, సిబ్బంది

కుప్పం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నుంచి బాధితులను కాపాడే క్రమంలో అమరులైన అగ్నిమాపక సిబ్బందికి కుప్పంలోని అగ్నిమాపక సిబ్బంది జోహార్లు అర్పించారు. కుప్పంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అగ్నిమాక కేంద్రం అధికారి డి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వేసవి కాలంలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుప్పం అగ్నిమాపక సిబ్బంది ఆర్ఎంజే. కుమార్, ఎస్.రెడ్డెన్న, జి.నరేశ్, కె.కృష్ణయ్య, వి.విజయ, సి.రఘుపతి, కె.మణి, సీకే.రామమూర్తి, కె.రఘుపతి, బి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు గంగమ్మగుడికి ఉత్సవ కమిటీ ఏర్పాటు



అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న గంగమ్మ గుడి ఉత్సవ కమిటీ సభ్యులు

పలమనేరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని తిరుపతి గంగమ్మ ఆలయానికి ఎట్టకేలకు ఎండోమెంట్ అధికారులు ఉత్సవ కమిటీని నియమించగా ఆ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సోమవారం ప్రకటించారు. గంగమ్మ గుడి ఉత్సవ కమిటీ సభ్యులుగా వై.శ్రీధర్, కె.విజయశేఖర్, బి.శ్యామలమ్మ, ఆర్. ఐశ్వర్య. కె.రోహిణి, ఎ.నాగరాణి, జి. ఈశ్వరప్రసాద్, పి. రాజేష్, ఎస్. ఆనందతీర్థరావులను కమిటీ సభ్యులుగా నియమించ బడ్డారని తెలిపారు. ఇందులో వై.శ్రీధర్ ఉత్సవ కమిటీ చెర్మన్‌గా, శ్యామలమ్మను వైస్ చైర్మన్‌గా నియమించినట్లు అమరనాథరెడ్డి ప్రకటించారు. ఉత్సవ కమిటీగా నియమితులైన వారు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శాలువతో సన్మానించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న బేరివైశ్యులు

కల్లూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు బజారువీధిలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం బేరివైశ్యుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ముస్తాబైన కల్యాణ మండపంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆశీనులు గావించారు. మంగళ వాయిద్యాలు.. అర్చకుల వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ షుకూర్

కల్లూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషి.. గ్రామసభలతోనే గ్రామాలు అభివృద్ధి చెందడం సాధ్యమవుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలంలోని అన్ని సచివాలయాల్లో సోమవారం సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు ఏర్పాటు చేశారు. కల్లూరు సచివాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామసభ ఆమోదంతోనే అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సర్పంచ్ షుకూర్, టీడీపీ, బీజేపీ నాయకులు నూర్‌బాషా, ఈఎం రత్నం, పార్థసారధి, ప్రజలు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలోని చిచ్చిలివారిపల్లె పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ సి.అరుణమ్మ కోరారు. సోమవారం చిచ్చిలివారిపల్లె, రొంపిచెర్ల పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు జరిగాయి. పార్టీలకు అతీతంగా పనులు చేయాలని అరుణమ్మ తెలిపారు. రొంపిచెర్లలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు, నూనె, సబ్బులు సర్పంచ్ ఇబ్రహీంఖాన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకేశవ, ఈవో సత్యంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి దశరథరెడ్డి పాల్గొన్నారు.

2న సామూహిక ఉపనయనం



ఉపనయన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘ నేతలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 2వ తేదీన ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా పుంగనూరులో జరిగే సామూహిక ఉపనయన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పుంగనూరు గాయిత్రి మాతా బ్రాహ్మణసేవా సంఘ ప్రధాన కార్యదర్శి రామ్మూర్తిశర్మ కోరారు. సోమవారం పుంగనూరులో సామూహిక ఉపనయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఉపనయనం కార్యక్రమంలో పాల్గొనే వారు ఈనెల 23వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మధుకుమార్‌శర్మ, ఉదయ్‌కుమార్, కృష్ణమూర్తి, కె.పి. మహేశ్‌కుమార్, గిరి, అశ్వర్థనారాయణరావు, రమణారావు, మల్లిఖార్జునరావు, సురేశ్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సంతాపం



సంతాపం వ్యక్తం చేస్తున్న సంఘ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవన్‌లో పుంగనూరులో ఇటీవల మృతిచెందిన విశ్రాంత ఉద్యోగులు సీతాపతి రాజు, చంద్రశేఖర్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు, అధ్యక్ష, కార్యదర్శులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, నాయకులు రంగనాథం, కేశవరెడ్డి, సుబ్రహ్మణ్యం, భానుమూర్తి, వెంకటపతి, ఈశ్వరరెడ్డి, రవి, గంగులమ్మ, లీలావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు అవసరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక అధికారి సుబ్బరాజు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక భగత్‌సింగ్‌కాలనీలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈనెల 20 తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కావమ్మ జాతర



బెస్తపల్లిలో కావమ్మ మారయ్యలు

రొంపిచెర్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం మోటుమల్లెల పంచాయతీ బెస్తపల్లిలో కావమ్మ, మారయ్యల జాతర ఘనంగా నిర్వహించారు. బెస్త కులస్తులు ఆడబిడ్డగా కొలిచే కావమ్మ తిరుణాల సోమవారం అగ్నిగుండ ప్రవేశంతో ముగిసింది.

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం

సోమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకమందలో పోలేరమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు సిద్ధమయ్యారు. నడింపల్లె, కరకమంద, సూరయ్యగారిపల్లె వాసులు అమ్మవారికి వందల ఏళ్ల క్రితం ఆలయాన్ని కరకమంద వద్ద నిర్మించారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు ఏకమై ఆలయ పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. డాక్టర్ శివమూర్తి, సర్పంచి వెంకటరమణ, దాత శ్యాంసుందర్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వయంభేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలకు శ్రీకారం

సోమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల నిర్వహణకు సోమవారం ఆలయం వద్ద ఉభయదారులు, గ్రామస్తులు ధర్మకర్త సోమశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 23 నుంచి ఉత్సవాల నిర్వహణకు చర్యలు చేపట్టారు.

ఆపన్నులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆపన్నులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి తెలిపారు. సోమవారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో మండల పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు రూ.8 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజనేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు పాల్గొన్నారు.

కనులపండువగా వసంతోత్సవం



త్రిశూలం, ఉత్సవమూర్తులకు మంగళ స్నానాలు చేయిస్తున్న వేదపండితులు

రామకుప్పం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం కనులపండువగా జరిగింది. ఉభయదారులు విశ్వనాథయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారు, అమ్మవారి ఉత్సవర్లను మాడ వీధుల్లో ఊరేగించారు.

రేపటి నుంచి టీడీపీ పంచాయతీ కమిటీల ఎన్నికలు

రామకుప్పం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో టీడీపీ పంచాయతీ కొత్త కమిటీల ఎన్నికలు 16వ తేదీ బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. 16న పంద్యాలమడుగు, పీఎంకేతాండా, గొరివిమాకులపల్లె, బందార్లపల్లె, 17న బైపరెడ్డపల్లె, రాజుపేట, కొంగనపల్లె, చెల్దిగానిపల్లె, 18న ముద్దనపల్లె, నారాయణపురంతాండా, ననియాతాండా, 89పెద్దూరు, 19న వీర్నమల, వీర్నమలపెద్దతాండా, గుట్టూరుతాండా, చిక్కపల్లెతాండా, 21న బల్ల, ఉస్సిగానిపల్లె, విజలాపురం, కెంచనబల్ల, 22న సింగసముద్రం, మణీంద్రం, రామకుప్పం పంచాయతీల కమిటీలకు ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమాలకు మండల పరిధిలోని నేతలు, ఆయా పంచాయతీల కార్యకర్తలు, నేతలు తమ సభ్యత్వ కార్డులు తమ వెంట తీసుకుని రావాలని వారు కోరారు.

సత్యసాయి గ్రామసేవ కరపత్రాల ఆవిష్కరణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకుగాను గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛందసేవ నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సమితి నిర్వాహకులు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, పాండురంగం, సత్యనారాయణ, సాయిప్రకాష్, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

మీ గ్రామాలకు మీరే ఎమ్మెల్యే

● ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి ● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



వి.కోటలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



ఆసుపత్రిలో ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

వి.కోట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ కార్యకర్తలెవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు.. మీ గ్రామానికి మీరే ఎమ్మెల్యేగా వ్యవహరించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి' అని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో టీడీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. గడచిన ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి మెజారిటీ అందించారని అభినందించారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా వాటిని నిర్వీర్యం చేస్తే.. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్రమం తప్పకుండా నిధులు ఇచ్చి బలోపేతం చేశామన్నారు. గ్రామాల్లో సమస్యలు వస్తే అక్కడ సర్పంచ్‌గా.. ఎంపీటీసీగా మన పార్టీ నాయకులు లేరని నిరుత్సాహ పడకండన్నారు. అక్కడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. త్వరితగతిన సాధికార సమితిలను పూర్తి చేసి గ్రామ, మండల కమిటీలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని వి.కోట మండలాన్ని కరువు మండలంగా ప్రకటిస్తామన్నారు. వి.కోటకు కుప్పంతో సమానంగా తాగునీటి సమస్య కోసం నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, శబరీష్, జిల్లా అధికార ప్రతినిధులు రాంబాబు, చౌడప్ప, నాయకులు సుబ్బన్న, విశ్వనాథ్, నాగభూషణం, శివకుమారి, జనార్దన్‌రెడ్డి, సతీష్, నారాయణస్వామి, హరినాథరెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రిగా ఆధునికీకరిస్తాం

వి.కోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద పడకల ఆసుపత్రిగా ఆధునికీకరిస్తామని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం వి.కోట సీహెచ్‌సీకి చేరుకున్న ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నూతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే, డైరెక్టర్లుగా పి.ఆర్.ధీరజ్, మాజీ సర్పంచ్ సుకన్య, బీజేపీ నేత పద్మనాభంలతో కలిసి ప్రమాణం చేశారు. వీరితో పాటు ఆసుపత్రి వైద్యాధికారి డా.మురళీ, ఎంపీడీవో ఈశ్వరన్, ఈవో శివశంకర్ కమిటీలో ఉంటారు. ఆసుపత్రి అభివృద్ధికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపడం జరిగిందని, త్వరలోనే 30 పడకల ఆసుపత్రిని వంద పడకలుగా పెంచే చర్యలు చేపడుతామన్నారు. అలాగే ఆసుపత్రిలో సమస్యలను ఆయన డిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, ఏఎంజీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, నేతలు రాంబాబు, శబరీష్, రామూర్తి, విశ్వనాథ్, గుణ, హరి, నాగరాజ్, లక్ష్మణ్, డా. మురళీకృష్ణా, డా. ప్రవీన్‌కుమార్, డా. సల్మా, డా.కిరణ్, డా.ప్రమీళా, డా. కల్పన, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళిత దీనజనోద్ధారకుడు.. అంబేడ్కర్



పలమనేరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



చౌడేపల్లెలో నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



కల్లూరు: దేవళంపేటలో చల్లా రామచంద్రారెడ్డి నివాళి



పుంగనూరులో...



కుప్పంలో అంబేద్కర్ విగ్రహం ఊరేగింపు



కుప్పం టీడీపీ కార్యాలయంలో...



కుప్పంలోని కడా కార్యాలయంలో...

కుప్పం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగ నిర్మాతయే కాదు.. దళిత బడుగు బలహీన వర్గాల భవిష్యత్తు ప్రదాత అని పలువురు నాయకులు పేర్కొన్నారు. కుప్పంలో సోమవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని, చిత్రపటాన్ని ట్రాక్టర్ పై ఉంచి పట్టణంలో ఊరేగించారు. అనంతరం బస్టాండు సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ మున్సిపల్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కడా కార్యాలయంలో పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మరోవైపు జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

● పలమనేరు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పలమనేరులో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, టీడీపీ నాయకులతో కలిసి నివాళులు అర్పించారు. అలాగే పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ● చౌడేపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● కల్లూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన సేవలు దేశానికి ఆదర్శమని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట సచివాలయంలో సోమవారం అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అలాగే 106 రామిరెడ్డిగారిపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నాయకులు ఘన నివాళి అర్పించారు. ● సోమల: సోమలలోని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమల దళితవాడ నుంచి అంబేడ్కర్ చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ● వి.కోట: వి.కోటలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరయ్యారు. ● బైరెడ్డిపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ● గుడుపల్లె: ద్రావిడ వర్సిటీ ఎమినో భవనంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతిని సోమవారం నిర్వహించారు. ● గంగవరం: గంగవరంలో టీడీపీ నాయకులు యుగంధర్ ఆధ్వర్యంలో గంగవరం పంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ● పుంగనూరు: పుంగనూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనగా జరుపుకున్నారు. దళిత సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, అంబేడ్కర్ అభిమానులు ఆయనను స్మరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు ట్రాక్టర్లకు అంబేడ్కర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి జమీందార్ ప్యాలెస్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ● రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆర్టీసీ బస్టాండు వద్ద , సదుం మండల పరిధిలోని దళితవాడల్లో నివాళులు అర్పించారు.

● రామకుప్పం: రామకుప్పంలో అఖిలపక్షాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు.

శ్రీరాముడికి పట్టాభిషేకం



శ్రీరాముడి పట్టాభిషేకంలో పాల్గొన్న చెన్నకేశవులు నాయుడు, కేవీఆర్ కుటుంబ సభ్యులు

గుడిపాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవాపల్లి పంచాయతీ కోలావూరులో గత తొమ్మిది రోజులుగా శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన సోమవారం శ్రీరాముని పట్టాభిషేకాన్ని గ్రామస్థులు, నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామునికి ప్రత్యేక అలంకరణ చేసి పట్టాభిషేకాన్ని పురోహితులు మహేష్ శర్మచే వైభవంగా నిర్వహించారు. ఉభయదారులుగా కేవీఆర్ బిల్డర్స్ కుటుంబసభ్యులు, జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోదరుడు గురజాల జీవన్ కుటుంబసభ్యులు నిర్వహించారు. పుష్పపల్లకిని గుణశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, బాలాజీ నాయుడు, మణి మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రాముడిని దర్శించుకున్న విజయేంద్రప్రసాద్

పూతలపట్టు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో వెలసివున్న కోదండ రామాలయాన్ని ప్రముఖ సినీ రచయిత, రాజ్యసభ సభ్యులు విజయేంద్రప్రసాద్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజా బ్యాటరీస్ వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం ఆయన పేటమిట్ట గ్రామంలో వున్న అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, పబ్లిక్ హెల్త్ సెంటర్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ గల్లా కుటుంబం గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తుండడం, సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికీ ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గల్లా కుటుంబీకులతో పాటు పేటమిట్ట గ్రామస్థులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

గుడిపాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దాతలు, ట్రస్టులు చేసే సేవా కార్యక్రమాలు మరువలేనివని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. సోమవారం మండలంలోని పేయనపల్లి, పాపిశెట్టిపల్లి, మొగరాలపల్లి, చీలాపల్లి హరిజనవాడలో హర్ష్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సుమారు రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ సుమతి, తుమ్మల సాంబశివ నాయుడు, పీటర్, హరిబాబు నాయుడు, జయచంద్ర నాయుడు, రవి, అరుణ్, రవినాయుడు, లోకనాథం నాయుడు, బోడెబ్బ నాయుడు, శివలింగారెడ్డి, హేమాద్రి నాయుడు, పళని గౌండర్, సురేష్, హర్ష్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సాజన్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ కత్తి శ్రీనివాసులు అన్నారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు చట్టాన్ని అతిక్రమిస్తే ఊరుకునేది లేదని, ఘర్షణలు,దౌర్జన్యాలకు పాల్పడకుండా ఉండాలని, కౌన్సిలింగ్‌కు పిలిచినవెంటనే రావాలని కోరారు. సత్ప్రవర్తనతో మెలిగేవారిపై కేసులు తొలగిస్తామని చెప్పారు. ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోదండ రాముడిని దర్శించుకున్న విజయేంద్రప్రసాద్



మాజీ మంత్రి గల్లా అరుణకుమారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సినీ కథల రచయిత, రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్

పూతలపట్టు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో వెలసివున్న కోదండ రామాలయాన్ని ప్రముఖ సినీ రచయిత, రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజా బ్యాటరీస్ వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం ఆయన పేటమిట్ట గ్రామంలో వున్న అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, పబ్లిక్ హెల్త్ సెంటర్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గల్లా కుటుంబం గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తుండడం, సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికీ ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గల్లా కుటుంబీకులతో పాటు పేటమిట్ట గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం



పట్టాభిషేకంలో పాల్గొన్న చెన్నకేశవులు నాయుడు, కేవీఆర్ కుటుంబ సభ్యులు

గుడిపాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవాపల్లి పంచాయతీ కోలావూరులో గత తొమ్మిది రోజులుగా శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన సోమవారం శ్రీరాముని పట్టాభిషేకాన్ని గ్రామస్థులు, నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామునికి ప్రత్యేక అలంకరణ చేసి పట్టాభిషేకాన్ని పురోహితులు మహేష్ శర్మచే వైభవంగా నిర్వహించారు. ఉభయదారులుగా కేవీఆర్ బిల్డర్స్ కుటుంబసభ్యులు, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోదరుడు గురజాల జీవన్ కుటుంబసభ్యులు నిర్వహించారు. పుష్పపల్లకిని గుణశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, బాలాజీ నాయుడు, మణి మొదలియార్, ఉదయ మధుసూదన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి సన్మానం



సన్మాన గ్రహీతలకు అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేస్తున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పేద దళిత వర్గాల కుటుంబాలకు సాయం అందిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న వంద మంది దళిత ఉద్యోగులను ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం సన్మానించారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత జాతి అభ్యున్నతి చెందాలంటే చదువే ముఖ్యమన్నారు. డ్రాపౌట్, ఆర్థికస్తోమత లేని విద్యార్థుల్లో ప్రతి దళిత ఉద్యోగి ఒక్కొక్కరిని దత్తత తీసుకొని వారి అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం వారందరినీ శాలువలు, గజమాలలతో ఘనంగా సన్మానించి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సీ మాల స్టేట్ డైరెక్టర్ పొన్నయుగంధర్ పాల్గొని సంఘ డైరీని ఆవిష్కరించారు. అంతకుముందు సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసులు, మురళి, భాస్కర్, షణ్ముగం, శేషాద్రి, రెడ్డప్ప, కృష్ణయ్య, కిరణ్, వెంకటరమణ, రాజు, మహేష్, చిన్నయ్య, సుబ్బయ్య, ప్రసాద్, నాగరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి: డీఎస్పీ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ పంపిణీ చేస్తున్న డీఎస్పీ

నగరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే విధిగా నేర్చుకోవాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ పేర్కొన్నారు. నగరి డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం కరాటే మాస్టర్ నేసకుమార్ 4వ వర్ధంతిని పురస్కరించుకుని కరాటే పోటీలు నిర్వహించారు. డీఎస్పీ అజీజ్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. అక్షర, జ్ఞానసుధ, ఎస్‌వి విద్యానికేతన్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు ముగిలన్, సుభాషిణి, పెరుమాళ్లు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

● ఎమ్మెల్యే ఎంపీ

గుడిపాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దాతలు, ట్రస్టులు చేసే సేవా కార్యక్రమాలు మరువలేనివని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. సోమవారం మండలంలోని పేయనపల్లి, పాపిశెట్టిపల్లి, మొగరాలపల్లి, చీలాపల్లి హరిజనవాడలో హర్ష్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సుమారు రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ సుమతి, తుమ్మల సాంబశివ నాయుడు, పీటర్, హరిబాబు నాయుడు, జయచంద్ర నాయుడు, రవి, అరుణ్, రవినాయుడు, లోకనాథం నాయుడు, హర్ష్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సాజన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మంజూరుపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

విజయపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసలనగరం నుంచి హనుమాన్ స్వామి ఆలయానికి 2.11 కిలోమీటర్ల తారురోడ్డుకు రూ.1.8 కోట్లు మంజూరు చేయడంపై కోసలనగరం వాసులు సోమవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూరకంగా కలిశారు. సంవత్సరాల తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం లభించడం ఆనందంగా ఉందని కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, వెంకట్రాజు, సుధాకర్‌రాజు, డి.సుబ్రహ్మణ్యంరాజు, శేఖర్, బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తమిళ సంవత్సరాది వేడుకలు

నగరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సరిహద్దున గల నగరిలో సోమవారం తమిళ సంవత్సరాది వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. తమిళ సంస్కృతి ఎక్కువగా ఉండే నగరిలో మహిళలు భక్తి శ్రద్ధలతో ఆలయాలలో దీపారాధనలు చేశారు. కామాక్షి సమేత కరకంతేశ్వరస్వామి ఆలయంలో మహిళలు 1008 దీపాలు వెలిగించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ కత్తి శ్రీనివాసులు అన్నారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు చట్టాన్ని అతిక్రమిస్తే ఊరుకునేది లేదని, ఘర్షణలు,దౌర్జన్యాలకు పాల్పడకుండా ఉండాలని, కౌన్సిలింగ్‌కు పిలిచినవెంటనే రావాలని కోరారు. సత్ప్రవర్తనతో మెలిగేవారిపై కేసులు తొలగిస్తామని చెప్పారు. ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రమణీయంగా సీతారాముల కల్యాణం

● ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, సమర్పించిన ఎంపీ, ఎమ్మెల్యేలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ఎన్.పి.వెంకటేశ్వర చౌదరి ఉభయంతో ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో అష్టోత్తర శతకలశ మహా తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం ఎన్.పి.జయప్రకాష్, పరంజ్యోతి ఉభయంతో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్మన్ కఠారి హేమలత పాల్గొని స్వామి అమ్మవార్లకు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పూజా సామగ్రిని స్థానిక బ్రాహ్మణ వీధిలోని కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి ప్రదర్శనగా తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. వారికి ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్ బృందం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. సీతారామ లక్ష్మణ ఆంజనేయ ఉత్సవ మూర్తులకు వైభవంగా పుష్పపల్లకి సేవ నిర్వహించారు.



సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు







అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఈవో వరలక్ష్మి, సిబ్బంది - ఎస్పీ మణికంఠ - జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి

అంబేడ్కర్ ఆశయాలను అందిపుచ్చుకోవాలి

● డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను అందిపుచ్చుకుని దేశానికి మన వంతు సేవలు అందించాలని డీఈవో వరలక్ష్మి సూచించారు. అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని సోమవారం స్థానిక డీఈవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి డీఈవో వరలక్ష్మి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ, ఏడీ వెంకటేశ్వరరావు, మురళీమోహన్, సత్యనారాయణ, గోపాల్, రమణ, కుమార్ సిబ్బంది ఉన్నారు. ● స్థానిక దర్గా సర్కిల్ కూడలిలోని అంబేడ్కర్‌కు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన వారిలో.. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు శరశ్చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ నాయుడు, శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవికుమార్, నాయకులు బ్రహ్మానందం, షణ్ముగం, రెహమాన్, రామభద్ర, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ ఉన్నారు.

అంబేడ్కర్ గొప్ప మానవతావాది: ఎస్పీ

చిత్తూరు అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయ నేతగా కంటే గొప్ప మానవతావాది అని ఎస్పీ మణికంఠ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఎస్‌బీ సీఐలు బాస్కర్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. ● చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, ఇతర సిబ్బంది నివాళులు అర్పించారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ● బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జీ షణ్ముగం, నేతలు రవీంద్ర రాజు, హరిబాబు, రుద్రయ్య, తదితరులు నివాళులర్పించారు. ● వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్, జ్ఞాన జగదీశ్, కేపీ శ్రీధర్ పాల్గొన్నారు.

చిత్తూరు సిటీ: జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, నేతలు త్యాగరాజన్, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ● జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి (డీఎఫ్‌వో) పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌వో కరుణాకర్, లీడింగ్ ఫైర్ మ్యాన్‌లు శోభన్, ఏసుపాదం, కుశలన్, గిరిబాబు, రాజు, నవీన్ కుమార్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: గిరింపేటలోని ఎస్‌ఈ కార్యాలయంలో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అధికారులకు పంచిపెట్టారు. గాంధీ రోడ్డులోని ఆపరేషన్ డివిజన్‌లో ఈఈ మునిచంద్ర అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈఈ సురేష్, డీఈలు ఆనంద్, ప్రసాద్, శేషాద్రి, సిబ్బంది పాల్గొని నివాళి అర్పించారు. ● చిత్తూరు రూరల్ మండల టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, మేషాక్, రాజా పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని పొలకలలో అంబేడ్కర్ విగ్రహానికి మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఐరాలలో వైసీపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కాణిపాకం ఆలయ ఈవో కార్యాలయంలో ఈవో పెంచల కిషోర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పొలకల ఉప సర్పంచి సురేంద్ర నాయుడు, దేవాజీ, వెంకటరత్నం, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం, వెంగళరాజుకుప్పం, ఆముదాల, వీర్లగుడి, బలిజకండ్రిగ, తిరుమలరాజుపురం గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెంగలరాజుకుప్పంలో అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు అరుణ్‌నాథన్, సాంబశివన్, అయ్యప్పన్, ఆనందరాజ్, తంగరాజ్, జాన్ విల్సన్ పాల్గొన్నారు.



చిత్తూరు గాంధీ విగ్రహం సమీపంలో ఏర్పాటుచేసిన భారీ అంబేడ్కర్ కటౌట్ వద్ద షెడ్యూల్డ్ క్యాస్ట్ ఎంప్లాయీస్ జేఏసీ నేతలు

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురం మండలం కేంద్రంలో, 49.కొత్తపల్లెమిట్ట, డి.కె.మర్రిపల్లె, ఎస్ఆర్‌పురం తదితర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్ నివాళులర్పించారు.

పెనుమూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, తలారి రెడెప్ప, భాస్కర్, ప్రసాద్, అశోక్, దళిత నేతలు నాగరాజు, మాధవ, వైసీపీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మిపతి, దళితులు పాల్గొన్నారు.

నగరి: నగరి బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే భానుప్రకాష్, మాజీమంత్రి ఆర్కే రోజా, అంబేడ్కర్ సంఘ నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ పూలమాల వేసి స్వీట్లు పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, బాలాజీ, పవర్ రామచంద్రన్, గోవిందస్వామి పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని మాధవరం, పన్నూరు, విజయపురం, మహారాజపురం, ఇళ్లత్తూరులో టీడీపీ, బీజేపీ, వైసీపీ నేతలు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇళ్లత్తూరులో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అంబేడ్కర్ యూనియన్ అధ్యక్షుడు సెల్వం, వైఎస్ఎంపీపీ మంజుబాలాజీ, జైభీమ్ నాయకులు కిషోర్‌బాబు, సెల్వం, అంబేడ్కర్ యువజన సభ్యులు పాండ్యన్, మహేంద్రన్, ఏలుమలై, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరులో టీడీపీ నేతలు కృష్ణమనాయుడు, స్వామిదాస్, దేవసుందరం, శ్రీధర్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, ఆ పార్టీ నేత రమేష్‌బాబు, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మణివర్మ, నేతలు ఇడగట్టి సుధాకర్ నివాళులు అర్పించారు. రాష్ట్ర అంబేడ్కర్ యువజన సేవాసంఘం అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఫ్లెక్సీ కటౌట్‌లతో ర్యాలీ నిర్వహించారు.



విద్యుత్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్



నగరిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వెదురుకుప్పం: వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలను పలు పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘాలు, అధికారులు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అన్నదానాలు చేశారు.



ఎస్ఆర్‌పురంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

నిండ్ర: మండల కేంద్రమైన నిండ్రలో శ్రీశైలం మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరి రూరల్ సీఐ భాస్కర్ పాల్గొని కేక్ కట్ చేశారు. పలు పార్టీల నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: బంగారుపాళ్యంలోని అంబేడ్కర్ విగ్రహానికి హరిజనవాడకు చెందిన యూత్ రాక్స్ జై భీమ్ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్సీ జయప్రకాష్, మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్రనాయుడులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంగళపల్లెలో రాష్ట్ర సర్పంచుల సంఘ కార్యదర్శి కుప్పాలపల్లె మురళీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ● మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలితకుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

గుడిపాల: గుడిపాలలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, టీడీపీ నేతలు నివాళులర్పించారు.

కులమతాలకు అతీతంగా అంబేడ్కర్‌ను ఆరాధించాలి

● ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అంబేడ్కర్‌ని ఆరాధించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా వేలాదిమంది ప్రజల సమక్షంలో భారీ కేక్‌ను కట్‌చేయడం సంతోషకరంగా ఉందన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోతుందన్నారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని, ఆయన కలలు కన్న సమానత్వ సమాజం కోసం అందరూ కలిసి పనిచేయాలన్నారు. పేదల అభివృద్ధి కోసం తానెప్పుడూ ముందుంటానని అన్నారు. అనంతరం చిత్తూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, పులివర్తి నాని మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీనవర్గాల ప్రజలకు చేసిన సేవలను గుర్తుచేశారు. అంతకుమునుపు నాయకులు, అంబేడ్కర్ అభిమానులు వేలాదిమంది స్థానికంగా వున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జ్యోతిరావు పూలే విగ్రహానికి కూడా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్, చిత్తూరు మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, ఎస్పీ మణికంఠ చందోలు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి యువరాజులు నాయుడు, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, పూతలపట్టు, ఐరాల, బంగారుపాళ్యం, తవణంపల్లె, యాదమరి మండలాల టీడీపీ కన్వీనర్లు దొరబాబు చౌదరి, గిరిధర్ బాబు, ఎన్‌పీ జయప్రకాష్, గాలి దిలీప్‌కుమార్, మురార్జీ యాదవ్, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు ఎన్‌పీ జయచంద్ర నాయుడు, హరిబాబు, ప్రతాపనేని చంద్రమౌళి, గణపతి నాయుడు, కోదండయ్య, గురుస్వామి, నాయకులు, కార్యకర్తలు, అంబేడ్కర్ అభిమానులు వేలాదిమంది పాల్గొన్నారు.



సమావేశంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీ

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

నగరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని నగరి అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ సుబ్బరాజు తెలిపారు. నగరి అగ్నిమాపక కేంద్రం వద్ద సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను స్థానిక ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి ప్రారంభించారు. ఏప్రిల్ 14వతేది నుంచి 20వ తేది వరకు అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, నగరి ఏరియా వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి గ్రామసేవ కరపత్రాల ఆవిష్కరణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా మితి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకుగాను గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛందసేవ నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సమితి నిర్వాహకులు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, పాండురంగం, సత్యనారాయణ, సాయిప్రకాష్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పాలాభిషేకం చేశారు. స్వామిని సుందరంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీ సేవలో ఊరేగించారు.

● వెదురుకుప్పం మండలం ఎగువ కన్నికాపురం వద్ద వెలసి ఉన్న మరకత వల్లీ సమేత స్వయంభు సిద్దేశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.

● వెదురుకుప్పం మండలం చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. ఆ తర్వాత పూల అలంకరణ సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

రోజాకు తమిళ నూతన సంవత్సర శుభాకాంక్షలు

విజయపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రోజాకు సోమవారం మండల వైసీపీ నాయకులు నగరిలోని ఆమె స్వగృహానికెళ్లి తమిళ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, వైసీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, నాయకులు సతీష్‌యాదవ్, శేఖర్‌రాజు, కుమార్, నారపరాజు, జిల్లుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అర్జున తపస్సుమాను



ధర్మరాజు పట్టాభిషేకంలో రుద్రయ్యనాయుడు దంపతులు

పెనుమూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు, శాతంభాకంలో మహాభారత ఉత్సవాలు జోరుగా జరుగుతున్నాయి. మహాభారత ఉత్సవాలు జరిపితే వర్షాలు పడతాయని పూర్వీకుల నమ్మకం. ఇందులో భాగంగా సోమవారం పెనుమూరు ముత్యాలమ్మ ఆలయంలో ధర్మరాజు పట్టాభిషేకం నిర్వహించారు. ఉభయదారులుగా మాజీ జడ్పీటీసీ రుద్రయ్యనాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. శాతంభాకంలో అర్జున వేషధారుడు పద్యాలు పాడుతూ తపస్సుమాను ఎక్కి నిమ్మకాయలు, పండ్లు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. ఉభయదారులుగా పెద్దరాజుపల్లికి చెందిన కన్నమ్మ, సుబ్రహ్మణ్యంరెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. సోమవారం మండలంలో మోస్తారువర్షం కురవడంతో ప్రజలుహర్షం వ్యక్తం చేశారు.

సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే

విజయపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారెడ్డి కండ్రిగలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పాతార్కాడు, నారపరాజు కండ్రిగలో సోమవారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీతారాముల వారిని పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గంధమనేని రాజేష్

నిండ్ర, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు స్వర్గీయ గంధమనేని రమేష్‌చంద్రప్రసాద్ కుమారుడు గంధమనేని రాజేష్ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను సోమవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండల అభివృద్ధి, పార్టీ బలోపేతం తదితర అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. బెంగళూరు రమేష్ నాయుడు, గిరి, గాలి రమేష్ నాయుడు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తమిళ ఉగాది

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని తమిళ కుటుంబాలు సోమవారం తమిళ ఉగాది పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తమిళ, తెలుగు వారు పరస్పరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.